ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

## (చించినాడలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 16-10-96)

ప్రియమైన ఆత్మబంధువులారా,

*అనపేక్షః శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః*
*సర్వారంభ పరిత్యాగీ యో మద్భక్తః స్సమే ప్రియః*

భక్తుల లక్షణాలను వాసుదేవస్వామివారు ఇక్కడ చెపుతున్నారు. ఈ పద్ధతిలో ఉంటే మీపట్ల నాకు ప్రేమ కలుగుతుంది అని చెపుతున్నారు. అనపేక్షః అంటే అపేక్ష లేకుండా ఉండటం అంటే కోరిక లేకుండా ఉండటం. మనం చేసే పని ప్రశాంతముగా, నిర్మలంగా ఉండాలి. దాని ఫలాన్ని ఎదురుచూసినట్లుగా ఉండకూడదు. నీకు కోరిక లేకుండా ఫలం వస్తే అది మిమ్మల్ని బంధించదు. కోరికతో తెచ్చుకుంటే అది దుఃఖకారణం, బంధకారణం అవుతుంది. శుచిః ఎప్పుడూ శుచిగా వుండాలి. ప్రకాశవంతముగా ఉండాలి. కొంతమంది ఎప్పుడూ ఇతరులలోని దోషములను చూస్తూ ఉంటారు. మనస్సును అంతర్ముఖం చేసుకొని వారిలోని దోషములను వారు చూసుకోరు. ఇతరులలోని దోషములను చూస్తూఉంటే అశుచి పెరిగిపోతుంది అని రామకృష్ణుడు చెప్పారు. దీని వలన వారు బాగుపడరు, కాలం ఖర్చు అయిపోతుంది. మన మనస్సు శరీరము, వాక్కు నిర్మలంగా ఉండాలి. మీవాక్కు ఇతరులకు చల్లదనం కలుగజేయాలి. వారిలో ఏమైనా దుఃఖం ఉంటే ఆ దుఃఖంను తగ్గించాలి. వారి చైతన్య స్థాయి పెరగాలి. మనస్సులో, వాక్కులో చేతలో దోషం లేకుండా చూసుకొంటే మీరు శుచివంతులు అవుతారు. భగవంతుని రోజూ ప్రార్థించండి. మీ మనస్సు, వాక్కు, శరీరం శుచి అవుతుంది. మీ బట్టలను, శరీరమును ఎంత శుచిగా వుంచుకొంటున్నారో మీ మనస్సును కూడా అంత శుచిగా ఉంచుకోండి. మీమనస్సును శుచిగా ఉంచుకొంటే బాహ్యంగా మీ స్నేహితులు చేయలేని ఉపకారం శుచిగా ఉన్న మనస్సు మీకు ఉపకారం చేసిపెడుతుంది. మీ మనస్సును మీరు బాగుచేసుకోవాలి. ఎప్పుడు బాగుపడుతుంది అంటే మీమనస్సును శుచిగా ఉంచుకొంటే అప్పుడు మనస్సు బాగుపడుతుంది.

దక్షః మీరు చేసే పనిలో నేర్పు కనబడాలి. పనిలో దేవుడిని చూస్తూ పనిలో మీ సమర్థత, నేర్పు, యుక్తిని చూపించాలి. వాడు దక్షుడు. అటువంటి భక్తుడు అంటే నాకు ఇష్టం, వాడు నాకు ప్రియుడు అని స్వామి వారు చెపుతున్నారు. మీరు ఏ పని చేసినా సమగ్రంగా ఉండాలి. ఆ పనిలో దేవుని చూడాలి. ఆ పనిని దేవునికి అర్పించి చేయాలి. ప్రవీణత ఉండాలి, సమర్థత ఉండాలి. ఒట్టిమాట కాదు ఆ మాటలకు తదనుగుణంగా ఆ పనిలో నేర్పు ఉండాలి. జీవితంలో సమర్థత లేకపోతే మీరు సమగ్రంగా అభివృద్ధి పొందలేరు.

ఉదాసీనః పక్షపాత రహితంగా ఉండాలి. అందరిని సమానంగా గౌరవించాలి, ప్రేమించాలి, బోధించాలి. అందుకొనేవారు అందుకొంటారు అందుకోలేని వారు అందుకోలేకపోచ్చు. అది వారికి సంబంధించిన విషయం. కొంతమంది ప్రతీ చిన్న విషయానికి ఒరిగిపోతారు, నిదానంగా ఆలోచించలేరు. ఎవడైతే ఒరిగిపోకుండా జీవిస్తున్నాడో, ఎవడైతే పక్షపాతం లేకుండా జీవిస్తున్నాడో, బంగారం అమ్మేవాడు ఎంత జాగ్రత్తగా తూస్తాడో అంత జాగ్రత్తగా ఎవడైతే తన బుద్ధిని చూసుకొంటున్నాడో వాడు భక్తుడు అవుతాడు. నా స్వరూపమును

పొందుతాడు. మీ హృదయంలో నేను ఉన్నాను. ఈ గుణాలు మీరు అలవర్చుకొంటే మీకు నేను వ్యక్తమవుతాను అని భగవంతుడు చెపుతున్నాడు.

గతవ్యధః కొంతమందికి బెంగపెట్టుకొనే అలవాటు ఉంటుంది. ప్రతీ చిన్న విషయానికి బెంగపెట్టుకొంటారు. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటూ ఉంటారు. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవటం వలన, జరగబోయే గొడవలు ఊహించుకోవటం వలన ఏమీ కలిసి రాదు. మీరు అస్తమాను భవిష్యత్ గురించి ఆలోచించవద్దు. జరిగిపోయిన గొడవల గురించి బెంగ పెట్టుకోవద్దు. వర్తమానకాలం నీ చేతిలో ఉంది. దానిని సరిగా ఉపయోగించుకో. మీ జీవితంలో ఏమి జరుగుతుందో భగవంతునికి తెలుస్తుంది. భగవంతునికి తెలియకుండా ఏమి జరగదు. భగవంతుడు సర్వవ్యాపియే కాదు సర్వజ్ఞుడు కూడ. ఆత్మ అంటే అంతటా వ్యాపించి వుంది. అది చావు పుట్టుకలు లేనిది. అది సృష్టి అంతా వ్యాపించి ఉంది. దానిని ఎవరూ నాశనం చేయలేరు. అది ఎవరో అనుకొంటున్నావేమో అది నీవే. ఆత్మ నీ హృదయంలోనే ఉంది. ఆత్మ ఊరికే తెలుస్తుందా దానికి తగిన మూల్యం చెల్లించాలి. బజారులో ఏదైనా వస్తువును కొనాలంటే దానికి తగిన మూల్యం చెల్లించకపోతే అది మన చేతికి రాదు. అలాగే నేను చెప్పిన ఈ సద్గుణాలు నీవు అలవర్చుకోలేకపోతే నీ హృదయంలో ఉన్న ఆ చావులేని వస్తువు నీకు తెలియదు అని భగవంతుడు చెపుతున్నాడు. ప్రతీ చిన్న విషయానికి బెంగపెట్టుకొని, చింతపెట్టుకొని కాలిపోతూ ఉంటే మీకు భక్తికలుగదు. భక్తిలేకపోతే మీకు ముక్తి కలుగదు.

సర్వ ఆరంభ పరిత్యాగి అన్ని ఆరంభాలు వదిలివేయండి అంటే స్వార్థ పూరితమైన పనులు వదిలి వేయండి. నీవు ఏపని చేసినా స్వార్థం కేంద్రం కాకూడదు. ఈశ్వరానుగ్రహం పొందటం కోసం పనిచెయ్యండి. అందరూ పెద్ద పెద్ద పూజలు, యజ్ఞాలు, యాగాలు చేయగలరా, అందరూ చేయలేరు. ఎవరో చేసారని మీకు చేసేశక్తి లేదని బాధపడకండి. నాకు ఇష్టమైన పనులు, నేను మెచ్చే పనులు చిన్నవి అయినా గొప్పగా చేయండి. చిన్నపనులే చేయండి. మీరు ఎలా చేస్తే మీమీద నాకు దయ కలుగుతుందో అలాగ చెయ్యండి. పెద్ద పనులు పెద్దవారికి వదిలి వెయ్యండి. చిన్నపనులే శ్రద్ధగా, ప్రేమగా చేయండి అని స్వామివారు చెపుతున్నారు. మీరు చేసే పనులు పదిమందికి ఉపయోగపడాలి, చల్లదనం కలుగజేయాలి. పదిమందికి ఉపయోగపడే పనులు చేయకుండా మీ గొప్పలకోసం పనులు చేస్తే మీకు తిప్పలు వస్తాయి, దేవుని అనుగ్రహం రాదు, మరణించిన తరువాత నీచమైన జన్మలు వస్తాయి. కొంతమంది స్వార్థం, అసూయ, ద్వేషంతో పనులు చేస్తారు. ఇటువంటి పనులు అసలు మొదలు పెట్టవద్దు అని చెపుతున్నారు. ఈ సద్గుణాలతో ఎవరు అయితే ఉన్నారో వారు అంటే నేను ఇష్టపడతాను, వారు నాకు భక్తులు అవుతారు అని స్వామివారు చెపుతున్నారు.

మీకు అనర్థం కలుగజేసే విషయాలవెంట వెళ్ళవద్దు అని ఆచార్యులవారు చెపుతున్నారు. దాని వలన దేహం పట్ల ఆసక్తి పెరుగుతుంది. విషాన్ని ఏ విధంగా దూరంగా ఉంచుతారో అలాగే మీకు ఏ విషయాలు అయితే మంచి కలుగజేయవో వాటిని దూరంగా ఉంచండి. మీరు ఏ పని చేసినా దేహబుద్ధితో పని చేయకూడదు. కొంతమంది 24 గంటలు దేహం గురించే ఆలోచిస్తారు. 24 గంటలు దేహం గొడవచూసుకొన్నా అది ఏదో ఒకరోజు స్మశానమునకు వెళ్ళక తప్పదు, కాలిబూడిద అవ్వటం తప్పదు. మీరు దుఃఖపడవద్దు. మీకు ఏ కారణం వలన అయినా దుఃఖం రావచ్చును. అది అందరికి పంచిపెట్టవద్దు. మీరు సంతోషంగా ఉండండి. మీరు దయ కలిగి ఉండండి. దయగల హృదయం భగవంతునికి నిలయం. కొంతమంది ఎదుటి వారికి కష్టాలు వస్తే సంతోషిస్తారు. వారికి దయలేదు అని అర్థం. ఎదుటివారు కష్టాలలో ఉన్నారు అనుకోండి మీరు ఉపకారం చేయలేకపోవచ్చు. కాని వారిని చూసి సంతోషిస్తారు ఏమిటి? ఇటువంటి

వారికి భగవదనుభవం ఎలా కలుగుతుంది? మీకంటే డబ్బులోగాని, చదువులోగాని తక్కువగా ఉన్నవారిని చూసి వెటకారంగా మాట్లాడవద్దు. వారి పట్ల దయకలిగి ఉండండి. ఎదుటి వారిని ఆక్షేపించవద్దు. మీరు ఏ విషయంలో వారిని ఆక్షేపిస్తున్నారో వచ్చే జన్మలో మీకు ఆ పరిస్థితులే మీకు ఎదురువస్తాయి. మీ తెలివి తేటలు సరిపోవు. మీరు దయ, ఓర్పు, నిదానం, క్షమ కలిగివుంటే భగవంతుడు మీ హృదయంలో ఎంతలోతులలో ఉన్నాడో అంతలోతులలోనికి దిగవచ్చు. హృదయం యొక్క లోయల లోనికి దిగితేనే భగవంతుడు తెలుస్తాడు.

తాత్కాలికమైన గొప్పలు, గౌరవాలలో మనం చిక్కుకు పోకూడదు. దూరదృష్టి కలిగివుండాలి. రాగద్వేషాల మధ్యన నీవు ఆగిపోవద్దు. నీ నిదానంలో నువ్వు ఉండు. శాంతిగా ఉండు. నీ ముక్కులో గాలి తిరుగు తున్నంతకాలం యజ్ఞ, దాన, తపస్సులను విడిచిపెట్టకు అని భగవంతుడు చెపుతున్నాడు. నీవు సాధకుడవు అయినా, జ్ఞానివి అయినా వీటిని విడిచిపెట్టవద్దు. నీవు సాధకుడవు అయితే వీటివలన పవిత్రుడవు అవుతావు. జ్ఞాని యజ్ఞ, దాన, తపస్సుల వలన పొందేది ఏమీలేదు. కాని ఇతరులకు ఆదర్శం కోసం వీటిని విడచిపెట్టకూడదు. ఎవడైతే మహాత్ముడో, ఎవడైతే చైతన్యస్థాయిలో ఉన్నతుడో వాడిని లోకం ఆదర్శంగా తీసుకొంటుంది. ఏ జ్ఞానగుణాల వలన నీకు జ్ఞానం కలుగుతుందో ఆ గుణాలను ప్రాక్టీసు చేసేటప్పుడు విసుగుగా చేయకూడదు. ప్రేమగా, ప్రీతిగా చేయాలి. విషయాలను విషంలాగ చూడు. భగవాన్ ఎంత ఓర్పుగా, ప్రేమగా చెప్పినా వాసన బలీయంగా ఉన్నవారికి అది అర్థమయ్యేదికాదు. మీరు చెప్పేది అర్థం కావటంలేదు అని చెప్పేవారు ఏమి చేస్తాము వాసన అంత బలీయముగా ఉన్నది అనేవారు భగవాన్. భగవంతుడు మనకి ఎంత హితవు చెప్పినప్పటికి మనలోని వాసన ఆ మంచిమాటలను బయటకు గెంటివేయాలని చూస్తుంది. వాసన నశించకుండా నీకు నిజం తెలియదు. నీ తెలివి వలన, యుక్తి వలన వాసన నశించదు. నీ నిగ్రహం సరిపోదు. నీవు చెయ్యగలిగిన ప్రయత్నం చెయ్యి. కొంచం ప్రయత్నం వలన, సాధన వలన వాసన నశించదు. అది విపరీతమైన వేగంతో వస్తోంది. వాసనల యొక్క ప్రవాహవేగమును నీవు తట్టుకోలేవు. వాసన నశించాలంటే ఈశ్వరానుగ్రహం, గురువు అనుగ్రహం, సత్పురుషుల సహవాసం అవసరం. వాసన నశించకుండా నీ హృదయంలో ఉన్న వస్తువు వ్యక్తం కాదు.

నాకు శాంతి కావాలి, నాకు శాంతి కావాలి అంటే అది రాదు. రాగ ద్వేషములు, కామక్రోధముల యొక్కవేగం ఎవరికయితే తగ్గిందో వారికి మాత్రమే శాంతి కలుగుతుంది. రాగద్వేషములు, కామక్రోధములతో మాడిపోతూ ఉంటే నీకు శాంతి కలుగదు. నీ మనస్సును బాహ్యముఖం చేసి ఇతరుల దోషములను కనిపెట్టటం వలన నీ కాలం, శక్తి వృథా అవుతుంది. దీని వలన నీకు ఏమీ కలిసిరాదు. నీ మనస్సును అంతర్ముఖం చేసి నీ లోపల ఉన్న దోషములను తెలుసుకొని అందులోనుండి బయటపడితే నీకు శాంతి కలుగుతుంది. ఆత్మసామ్రాజ్యానికి అధిపతివి అవుతావు. మోక్షపురుషార్థం కోసం ఎవడైతే ప్రయత్నం చేస్తున్నాడో వాడు దేహన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టాలి. జరిగేది అంతా ఈశ్వర సంకల్పమే అని ఎవడైతే నిర్ణయానికి వచ్చాడో వాడు మాత్రమే దేహాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టగలడు. నీదేహాన్నిప్రారబ్ధానికి విడిచిపెట్టు. దేహపోషణ బుద్ధితో ఉండకూడదు. ఎవడైతే నిరంతము నన్నే స్మరిస్తున్నాడో, నన్నే అభ్యాసం చేస్తున్నాడో, నాకు ఇష్టమైన పనులు చేస్తున్నాడో వాడి భారమంతా నేను తీసుకొంటాను అని భగవంతుడు చెబుతున్నాడు. నీకు దేహం జ్ఞాపకం వస్తూ ఉంటే దానికి సంబందించిన పరివారం, గొడవ అంతా జ్ఞాపకం వస్తుంది. అప్పుడు ఈశవం గొడవలోనే ఉంటాము. శివుడు గొడవ మర్చిపోతాము. అప్పుడు మోహం లో పడతాము. దేహానికి సంబంధించిన మోహంలో ఎంతకాలం ఉన్నామో అంతకాలం మోక్షం సంపాదించాలనే అపేక్ష నీకు కలుగనే కలుగదు. ఎవడైతే మోహంలో నుండి బయట పడతాడో వాడే మృత్యువులో నుండి బయట పడతాడు. ఈ

జన్మలో మనకు మోక్షం కలుగక పోయినా కనీసం సత్వగుణాన్ని సంపాదించుకొంటే ఆ సత్వగుణం మనకు జ్ఞానానికి వెళ్ళే మార్గం చూపిస్తుంది.

ఇతరులు నిన్ను ప్రేమిస్తూ ఉంటే నీవు వారిని ప్రేమించటం గొప్పకాదు. ఇతరులు నీ హితవు కోరుతూ ఉంటే నీవు వారి హితవు కోరటం గొప్పకాదు. ఇతరులు నిన్ను ప్రేమిస్తున్నా, ప్రేమించకపోయినా, నీ హితవు కోరినా, కోరకపోయినా నీవు వారిని ప్రేమిస్తూనే ఉండు, వారి హితవును కోరుతూనే ఉండు అంటున్నారు ఆచార్యులవారు. వారి హితవు ఎందుకు కోరాలి అని కారణం కోసం వెదకవద్దు. కారణం లేకుండా వారి హితవు కోరుకో, వారిని ప్రేమిస్తూ ఉండు. భగవంతుని సన్నిధిని చేరటానికి అది నీకు సహకరిస్తుంది.

దేవుడే పని చేస్తున్నాడు. కాని నేను చేస్తున్నాను అనే ఆలోచన ఏ జన్మలో పట్టుకొందో, ఏఅజ్ఞానం వలన ఇది పట్టుకొందో అది మనలను పీడిస్తోంది. ఇందులో నుండి విడుదల పొందడానికి నేను ఎవరు అనే ప్రశ్న అవసరము. నీ హృదయంలో దేవుడు ఉన్నాడు. దేవుని విడిచిపెట్టేసి నేను అనే తలంపు నీ శిరస్సులోనికి వచ్చి విజృంభిస్తోంది. నేను అనే తలంపు శిరస్సులో విజృంభిస్తూ ఉంటే దాని వేగమును నీవు తట్టుకోలేవు. నీ హృదయంలో ఉన్న దేవుని విడిచిపెట్టి నేను నేను అని నీ శిరస్సులోనికి వచ్చి విజృంభించేవాడు ఎవడు? దేవుని అడుగువాడి పాదాలను ఈ నేను అనే తలంపు మీద పెట్టమని. దేవుని పాదాలను ఈ నేను అనే తలంపు మీద పెడితే వాడి మూలంలోనికి వాడు పోతాడు. ఈశ్వరుడి పాదాలను వాడి నెత్తిమీద పెడితేనే గాని వాడు అణగడు. నీ హృదయంలో నుండి లెగిసి వస్తున్న నేనును అడుగు నీవు ఎవరు? అని దేహానికి, నీకు సంబంధం ఏమిటి అని ప్రశ్నించు. హృదయంలో ఉన్న దేవుని వదిలిపెట్టి నేను నేను అని లెగిసి వస్తున్నావు. ఎవడవురా నువ్వు అని ప్రశ్నించి వాడిని మూలంలోనికి త్రొక్కివేయి వాడు నశిస్తాడు. దేహగతమైన నేను ఎక్కడ నుండి వస్తున్నాడో అక్కడే వాడిని త్రొక్కేయండి. నీవు దేవుని వదిలిపెట్టి ఎందుకు వస్తున్నావు? దేవుని నుండి ఎందుకు వేరుపడ్డావు? వేరుపడి ఎంతకాలం అయింది? వేరుపడవలసిన అవసరం ఏమిటి? అని వాడిని ప్రశ్నించి వాడిని లోపలకు తొక్కివేయండి. దీనికి మీ తెలివితేటలు, మీ సాధన సరిపోదు. ఆయన పాదాలను తీసుకొని వచ్చి ఈ నేను మీద పెట్టమని ఈశ్వరుని బ్రతిమాలండి. ఆయన పాదాలు ఈ నేను మీద పెడితే అప్పుడు వాడు అణిగిపోతాడు.

మీకు ఇష్టమైన గురువు యొక్క నామం, దేవుని నామం స్మరించుకోండి. మీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణం చేయండి. మీరు బాగుపడటం ముఖ్యం. ఎవరు ఏ మార్గంలో ప్రయాణించినా నన్నే చేరుకుంటారు. అంటే ఆత్మనే చేరుకొంటారు అని భగవంతుడు చెప్పాడు. మీకు ఒక దేహం ఉంది. మీ దేహమే మీ కర్తృత్వాన్ని పెంచుతోంది. అసలే అది ఒక శవం. దానికి గౌరవాలు, ఊరేగింపులు కావాలి. నీ దేహం అంటే నీ ఉపాదే కర్తృత్వం పెరగటానికి కారణం. ఉపాధి లేకపోతే కర్తృత్వం ఏమిటి? నీ స్వార్థం, క్రోధం, ప్రేరేపించే పనులు మొదలు పెట్టవద్దు. ఇతరులకు భయపడి ఏ పనులు చేయకు. అటువంటి పనులను త్యాగం చెయ్యి. నీవు ఇతరులకు భయపడకు, ఇతరులను భయపెట్టకు. భగవంతుడు చెప్పిన మాటలయందు మనకు విశ్వాసం కలుగకపోతే మనలో దోషం ఉందని అర్థం. భగవంతుని తెలుసుకోవాలనే కాంక్ష లోపలనుండి వస్తే భగవంతుడు తెలియబడతాడు. సాత్వికులు ధన్యులు. వారు దేవుని చూచెదరు. అంతమాత్రమే కాదు ప్రపంచమును స్వతంత్రించుకొందురు. సత్వగుణం ఉన్నవారు ఏ ఇంటికి వెళ్ళినా వారి స్వంత యింటికి వెళ్ళినట్లుగానే ఉంటుంది. సత్వగుణం యొక్క వైభవం అటువంటిది. ఎవరికైతే సత్వగుణం ఉందో వారికి ప్రపంచం అంతా వారి ఇల్లే. మీ ఇంటిలో నీవు ఎంత స్వతంత్రంగా వుంటావో సత్వగుణం ఉన్నవాడు ప్రపంచంలో అంతా స్వతంత్రంగా ఉంటాడు.

*